క్లుప్తంగా

పోలీస్ గ్రీవెన్స్‌కు 10 వినతులు



వనపర్తి: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 10 అర్జీలు వచ్చాయి. ఎస్పీ రక్షిత కె.మూర్తి ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని అర్జీలు స్వీకరించారు. దాఖలైన వాటిలో భార్యాభర్తల గొడవకు సంబంధించి ఒకటి, పరస్పర గొడవల ఫిర్యాదులు మూడు, భూ తగాదాల అర్జీలు ఆరు ఉన్నాయి.

'రూ.18 వేలు వేతనం ఇవ్వాలి'

ఆత్మకూర్: ఆశా కార్యకర్తలకు పనిభారం పెరిగిందని, పనికి తగ్గ వేతనం రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లాకోశాధికారి శ్రీహరి డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలతో కలిసి స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద నిరసన తెలిపి వైద్యులకు వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని, పరీక్షలను రద్దు చేయాలని, పారితోషికాలకు సంబంధించిన బకాయిలను ఇవ్వాలని, అదనపు పని భారాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో నవనీత, ఈశ్వరమ్మ, ఆకాంక్ష, గోపాలమ్మ, సరస్వతి, శ్యామల, రేణుక, పుష్పలత, బాలమ్మ, శోభ ఉన్నారు.

ప్రజలు సహకరించాలి



పాన్‌గల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు తోడ్పాటునందించాలని తెల్లరాళ్లపల్లి తండా సర్పంచ్ శాంతమ్మ అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం తండావాసులతో కలిసి ఆమె కాలనీలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈనెల 17వ తేదీ నుంచి 23వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. కాలనీల్లో ఇష్టానుసారంగా చెత్తను పారవేయకుండా చెత్త ట్రాక్టర్ వచ్చిన సమయంలో అందులో వేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, పంచాయతీ కార్యదర్శి నర్మద, తండా వాసులు పాల్గొన్నారు.

స్థలం కేటాయింపు


వనపర్తి: జిల్లా కేంద్రంలోని నాగవరం శివారులోగల 411 సర్వే నెంబర్‌లో రజక భవన్ నిర్మాణానికి 8 గుంటల భూమిని కేటాయిస్తూ ప్రొసీడింగ్‌ను సోమవారం రజక సంఘం నాయకులకు మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కుల సంఘాలకు ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి చెప్పారు. త్వరలో రజక ఆత్మగౌరవ భవన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తామన్నారు. కార్యక్రమంలో రజక సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, సలహాదారులు లక్ష్మయ్య, గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, జిల్లా అధ్యక్షులు విజయ్, టౌన్ అధ్యక్షుడు తినేటి ఆంజనేయులు, నాయకులు సత్యేందర్, శివ, మహేష్ పాల్గొన్నారు.

కౌన్సిలర్ ఔదార్యం



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని వనపర్తి వెళ్లే రహదారిపై గుంతలకు సోమవారం సామాజిక వేత్త, కౌన్సిలర్ అక్కమ్మ మట్టి కొట్టించారు. కొన్ని రోజులుగా అకాల వర్షాలు కురుస్తుండడంతో రోడ్డు పూర్తి దెబ్బతిని గుంతలుగా మారింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించిన అక్కమ్మ తమ సొంత ఖర్చులతో మట్టి వేయించి తానే గుంతలు పూడ్చారు. దీంతో వాహనదారులు, ప్రజలు అక్కమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

మోటార్ అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అల్వాలలో రెండు నెలలుగా ఫిల్టర్ వాటర్ సంపు మోటార్ చెడిపోవడంతో స్థానిక టీఎమ్మార్ యువజన సభ్యులు విషయాన్ని ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మేఘారెడ్డి కొత్త మోటార్‌ను కొనుగోలు చేసేందుకు కావాల్సిన రూ.12వేలు టీఎమ్మార్ సభ్యులకు ఇవ్వడంతో సోమవారం కొత్త మోటార్‌ను సంపుకు బిగించారు. సమస్య ఉందని చెప్పిన వెంటనే స్పందించిన ఎంపీపీ మేఘారెడ్డికి గ్రామస్తులు, యువకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, సాయిరెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, కొండన్న, కుర్మయ్య, బాలకృష్ణ, బాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి ఉన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

కొత్తకోట: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ పొగాకు సుఖేశిని అన్నారు. కొత్తకోటలో సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 'మేరా లైఫ్ మేరా స్వచ్ఛ షహేర్'లో భాగంగా ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపాలిటీ అందించిన చెత్త బుట్టల ద్వారా వార్డుల వారీగా ప్రారంభిస్తున్న ఆర్ఆర్ఆర్ సెంటర్లకు అప్పజెప్పాలని సూచించారు. వాటిని డంపింగ్ యార్డుకు పంపించి రైతులకు, ప్రజలకు ఉపయోగపడే ఎరువులను తయారు చేసి ఉపయోగంలోకి తీసుకొస్తామని ఆమె వెల్లడించారు. వచ్చే వానాకాలం దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. భావితరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందజేయాలంటే ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రవీందర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య పాల్గొన్నారు.

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పురచైర్‌పర్సన్ గాయత్రి రవియాదవ్, వైస్‌చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా 10 వార్డుల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులను చేపట్టారు. చెత్తను బయట పారవేయకుండా డబ్బాల్లో వేసి చెత్త బండికి అందించాలని సూచించారు.

అమరచింత: మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దటమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అన్ని వార్డుల్లో ప్రభుత్వ ఆదేశానుశారం ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. పట్టణంలోని తొమ్మిది, నాల్గో వార్డులో సోమవారం 'మేరా లైఫ్ మేరా స్వచ్ఛ షహేర్' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఉన్న పాత వస్తువులు, కాగితాలను, నోటుపుస్తకాలను, పాత బట్టలు, చెప్పులు, ప్లాస్టిక్ పాడైన వస్తువులను స్వచ్ఛందంగా మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత వ్యవహారంలో ప్రతి ఒక్కరూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. తడి, పొడి చెత్తలను డంపింగ్‌యార్డుకు తరలించడంలో ప్రజలు సంపూర్ణంగా సహకరిస్తున్నారని, ఇంట్లో ఉన్న పాత, పనికిరాని వస్తువులను మున్సిపల్ ద్వారా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ సెంటర్లలో అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ మహమ్మద్‌ఖాజా, కౌన్సిలర్ సింధు, రాజశేఖర్‌రెడ్డి, మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ



కొత్తకోటలో..



ఆత్మకూర్‌లో..

అంధత్వ నివారణకే 'కంటివెలుగు'



కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



తిప్పాయిపల్లిలో..

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని, ప్రజల్లో అవగాహన కలిగించే బాధ్యతను సర్పంచ్, అధికారులు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో పెట్టిన ఈ కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే సూచించారు. కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేయడంతో పాటు ఆపరేషన్ అవసరమైన వారికి కూడా ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటరమణమ్మ, సర్పంచ్ లక్ష్మీశ్రీధర్‌రెడ్డి, చిన్నారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: మండలంలోని తిప్పాయిపల్లిలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'కంటివెలుగు' కార్యక్రమం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య అధికారి బాలరాజు, ఉప సర్పంచ్ బుచ్చన్న, పంచాయతీ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని ఓఆర్ఎస్ ప్యాకెట్లు

అమరచింత: వేసవి ఎండలు ముదురుతున్న వేళ ఎండల నుంచి ఉపసమనం పొందాలని భావించిన ప్రజలు ఓఆర్ఎస్ ప్యాకెట్ల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లినా అందుబాటులో లేవని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అడిగితే మీ ఏరియా ఆశా వర్కర్ లేదా అంగన్‌వాడీ టీచర్లను అడగాలని సమాధానం చెప్పడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎండల తాకిడికి వడదెబ్బకు గురికాకుండా ప్రతి ఒక్కరూ లీటర్ మంచి నీటిలో ఓఆర్ఎస్ ప్యాకెట్ కలుపుకొని తాగాలని అవగాహన సదస్సులు కల్పిస్తున్న ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేయట్లేదని మండిపడుతున్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలను అడిగినా.. స్టాకు రాలేదంటూ తప్పించుకోవడంతో తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ మెడికల్ షాపుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు దాపరించాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇంటింటికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గాయత్రి

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, చిన్నారులకు మెరుగైన వైద్య సేవలనందించాలని పురచైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని గాంధీచౌక్‌లో శ్రీఆదిత్య చిన్నపిల్లల ఆస్పత్రిని ప్రారంభించారు. వారం రోజులపాటు ఉచితంగా వైద్య సేవలను, ప్రతి ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ బాలరాజు తెలిపారు. మండలంలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేగంగా కల్వర్టుల నిర్మాణాలు

మున్సిపాలిటీ పరిధిలోని అమరచింత రోడ్డుపై నిర్మిస్తున్న కల్వర్టుల నిర్మాణాలు త్వరతగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్మాణ పనులను కమిషనర్ నాగరాజుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాత వస్తువులను అప్పగించండి



ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ వద్దనున్న పాత వస్తువులు, బట్టలు, పాదరక్షలు, బుక్కులు, న్యూస్‌పేపర్లు మున్సిపాలిటీకి అప్పగించాలని పురచైర్‌పర్సన్ గాయత్రి రవియాదవ్, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు అన్నారు. సోమవారం ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్ఆర్ఆర్ కార్యక్రమంలో భాగంగా 10 వార్డుల్లో శిబిరాలను ఏర్పాటు చేసి పాత వస్తువులను సేకరించారు. పాతసామన్లు అప్పగించిన వారికి ప్రశంసా పత్రాలను అందజేస్తామని, పట్టణ అభివృద్ధికి, పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'శేఖర్ మృతికి కారణమైన వారిని గుర్తించాలి'

ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన శేఖర్ మృతికి కారణమైన వారిని గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాసులు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎర్రం భగవంతుమాదిగ డిమాండ్ చేశారు. శేఖర్ మృతిపై అనుమానం ఉందని, ఈ విషయమై ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని సోమవారం ఎస్పీ రక్షిత కె మూర్తికి వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 20 రోజుల క్రితం కొందరు కావాలని శేఖర్‌ను చంపి గ్రామం వెలుపల చెట్టుకు ఉరివేశారని ఆరోపించారు. ఇప్పటికైనా దుండగులపై వారం రోజుల్లో కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యాదయ్య, ఎర్రన్న, అంజనేయులు, బాల్‌రాజు, తిరుపతయ్య, వెంకటయ్య, యాదయ్య, రత్నయ్య, సాయికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బకాయిలు చెల్లించండి

కోడేరు: పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీ డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ చేసిన పనికి డబ్బులు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన లాభం లేకుండాపోయిందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు అందించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



వనపర్తి అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి దంపతులు



కుంటముందలితండాలో దేవతల విగ్రహాలను తీసుకొస్తున్న తండావాసులు



కుంటముందలితండాలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన అభయ రామలింగేశ్వరుడి గర్భగుడిలో శివలింగం, నంది, సుబ్రహ్మణ్య స్వామి, అమ్మవారి విగ్రహం, ధ్వజస్తంభాన్ని సోమవారం వేద పండితుల మంత్రోచ్ఛరణలు మధ్య ప్రతిష్ఠించారు. 19, 20వ వార్డు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సుగూరు ఎల్లస్వామి ఆధ్వర్యంలో మంత్రి నిరంజన్ రెడ్డి దంపతులు హాజరై పూజలు చేశారు. విగ్రహాల, ధ్వజస్తంభ ప్రతిష్ఠకు కృషి చేసిన భక్తులను మంత్రి నిరంజన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు పాకనాటి కృష్ణ, సుగూరు చంద్రకళ, ఎల్ఐసీ కృష్ణ, లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, దేవాలయ కమిటీ సభ్యులు మౌలాలీ, తిరుపతయ్య, పాకనాటి సత్యం, రవి, గోపాల్, బొండుపల్లి సతీష్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని కుంటముందలితండాలో సోమవారం గణపతి, నవగ్రహ, ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠామహోత్సవంతో పాటు వీరాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు. ఆరాధన, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, బలిప్రదానం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను తండావాసులు నిష్ఠతో నిర్వహించారు. ఆలయం ఆవరణలో అన్నదానం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి, మాజీ మంత్రి చిన్నారెడ్డి ఉత్సవాలకు హాజరై స్వామివారికి పూజలు చేశారు. దేవాలయ అభివృద్ధి కోసం మంత్రి సతీమణి రూ.లక్ష, మాజీ మంత్రి చిన్నారెడ్డి రూ.20 వేలను దేవాలయ కమిటీకి అందజేశారు. ఉత్సవాల సందర్భంగా ఆడపడుచులు, బంధువులతో రాకతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణానాయక్ తదితులు పాల్గొన్నారు.

'బ్యాంకు మిత్ర'తో లావాదేవీలు సులభం



వినియోగదారులకు పాస్‌బుక్ అందజేస్తున్న భీమ్‌సేన్‌రావు

కొత్తకోట: బ్యాంకు మిత్రతో లావాదేవీలు సులభతరమని నాగర్‌కర్నూల్ రీజియన్ మేనేజర్ భీమ్‌సేన్ రావు సూచించారు. మండలంలోని వడ్డెవాటలో సోమవారం నాగర్‌కర్నూల్ రీజియన్ పరిధి నుంచి బ్యాంకు మిత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు మిత్ర ద్వారా లావాదేవీలను కొనసాగించుకోవచ్చని తెలిపారు. దీంతో గ్రామ ప్రజలు పట్టణాల్లోని బ్యాంకుల వద్దకు రావాల్సిన అవసరం ఉండదని ఆయన సూచించారు. బ్యాంకుల్లో లభించే సర్వీసుల్లో చాలా వరకు బ్యాంకు మిత్ర అందిస్తుందని తెలిపారు. బ్యాంకు మిత్ర అంటే మినీ బ్యాంకు అని, దీని ద్వారా ఖాతా తెరవడం, నగదు జమ చేయడం, విత్‌డ్రా చేసుకోవడంతో పాటు, వేరు వేరు ప్రభుత్వ స్కీములను బ్యాంకు మిత్ర ద్వారా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కొత్తకోట శాఖ బ్యాంక్ మేనేజర్ కళ్యాణ్, ఫీల్డ్ ఆఫీసర్ శేఖర్, రీజినల్ ఇన్‌చార్జి భాను, రీజినల్ హెడ్ రమేష్, ఛానల్ మేనేజర్ పవన్, బ్యాంకు మిత్ర లత పాల్గొన్నారు.

దళితుల ఆరాధ్యుడు భాగ్యరెడ్డివర్మ



భాగ్యరెడ్డివర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: దళితుల ఉద్యమానికి దారి చూపి వారి అభివృద్ధి కోసం భాగ్యరెడ్డివర్మ ఎనలేని సేవలు చేశారని ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాశ్ అన్నారు. సోమవారం భాగ్యరెడ్డివర్మ 135వ జయంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్ మాట్లాడుతూ.. అంబేద్కర్ కంటే ముందే దళిత వర్గాలను చైతన్యం చేసేందుకు పోరాడిన యోధుడు భాగ్యరెడ్డి వర్మ అని గుర్తుచేశారు. కార్యక్రమంలో కవులు, ప్రజాప్రతినిధులు గిరిరాజాచారి, గంధం నాగరాజు, వెంకటస్వామి, గంధం ఆంజనేయులు, గంధం గట్టయ్య, అంబటి స్వామి, డప్పు నాగరాజు, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎంవీ రామన్ విద్యార్థులకు కలెక్టర్ అభినందన



ఎంవీరామన్ విద్యార్థులతో కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్

ఆత్మకూర్: విద్యార్థులు కష్టపడి చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంవీరామన్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కలెక్టర్ అభినందించారు. ఎంవీరామన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు విజయ పరంపర కొనసాగిస్తున్నారని, ఈఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే అత్యధిక మార్కులు సాధించారని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ అన్సి శ్రీధర్ తెలిపారు.

మున్సిపాలిటీ పనుల్లో అక్రమాలను ఎండగడతాం



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న విజయరాములు

అమరచింత: కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీగా ఏర్పడిని అమరచింత పట్టణాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాల్సిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ, అసమానతలు చూపుతున్నరని సీపీఐ జిల్లా కార్యదర్శి, మూడో వార్డు కౌన్సిలర్ విజయరాములు అన్నారు. మూడో వార్డులో మంజూరైన పనులను కాదని, విరుద్ధంగా పనులు చేయడం ఏమిటంటూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో జరిగిన తీర్మానాల ప్రకారం పనులు జరుగకుండా చైర్‌పర్సన్ భర్త తనకు అనుగునంగా పనులను మార్చుకుంటూ ప్రతిపక్ష పార్టీల వార్డులకు మొండి చెయ్యి చూపుతున్నారని మండిపడ్డారు. ఈమేరకు విజయరాములు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలను ప్రజల్లో ఎండగడతామని వెల్లడించారు.

విపక్ష కౌన్సిలర్లపై చిన్నచూపు

మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.ఐదు కోట్లు మంజూరవ్వగా.. అందులో రూ.3.30కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. అధికార పార్టీ వారికి పనుల కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తూ విపక్ష కౌన్సిలర్లను విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఎనిమిదో వార్డులో ఒకే పనికి రెండు సార్లు మంజూరు ఇచ్చారన్నారు. మూడు, నాలుగు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉన్న పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యత కూడా లోపించిందన్నారు. ఈపనులను పర్యవేక్షిస్తున్న డీఈ శ్రీనివాసులు దృష్టికి సమస్యను తీసుకెళ్లినా.. ఆయన సైతం కాంట్రాక్టరుకు వత్తాసు పలుకుతూ తమపై దురుసుగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అన్నారు. కౌన్సిలర్లతో డీఈ వ్యవహరించిన తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

నిర్మాణాల్లో నాణ్యత లోపం

పట్టణంలో నిర్మించిన డివైడర్ నాణ్యత లేని కారణంగా ఏడాదికే కూలిపోతుందని విమర్శించారు. మున్సిపాలిటీలో చేపట్టిన హరితహారం లెక్కలు అడిగినా అధికారులు చెప్పడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ అధికార, ప్రతిపక్ష పార్టీలకు సంధానకర్తగా ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో అమరచింత కూడలిలో నడిరోడ్డుపై బైఠాయించి అక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం కమిషనర్ మహమ్మద్‌ఖాజాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు అబ్రహం, భాస్కర్, కుతుబ్, శ్యాంసుందర్, గీత, లక్ష్మీనారాయణ, కుమార్, నరసింహ, పద్మ, ఇబ్రాయిల్, సౌలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ మేఘారెడ్డి

వనపర్తి: నియోజకవర్గంలో ఎక్కడ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీపీ మేఘారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని ఐదో వార్డు పరిధిలో గల వశ్యానాయక్ తండాను ఆయన సందర్శించారు. దీర్ఘకాలికంగా తండాలో తాగునీటి సమస్యను పాలకులు పట్టించుకోవటం లేదని తండావాసులు ఆయన దృష్టికి తెచ్చారు. తండాలో ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కిచ్చారెడ్డి, కౌన్సిలర్ బ్రహ్మంచారి, వెంకటేష్, రాధాకృష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి, కాశీంనగర్ ఎంపీటీసీ నాగరాజు, గట్లఖానాపూర్ ఎంపీటీసీ దామోదర్, నాయకులు గట్టుయాదవ్, మనిగిళ్ల తిరుపతిరెడ్డి, తిరుపతియాదవ్, వాకిటి బాలరాజ్, శివయాదవ్, సోమనాథ్ నాయక్, సత్యం, గౌడ్‌నాయక్, శంకర్‌నాయక్, సిద్ధార్థనాయక్, శ్రీకాంత్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు నేలకొరిగిన నిమ్మచెట్లు

పెబ్బేరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం కురిసిన ఈదురు గాలులతో కూడిన వానకు రోడ్లపై వృక్షాలు, మామిడి, నిమ్మ, వరి పంటలు పూర్తిగా నేలకొరగడంతో సోమవారం వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. యాసంగిలో సాగుచేసిన పంటలు చేతికొచ్చే క్రమంలో అకాల వర్షాలు, ఈదురు గాలులతో తీవ్రంగా నష్టపోయామని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. అలాగే పెబ్బేరు శివారులో రైతు సుదర్శన్‌కు చెందిన రెండు ఎకరాల మామిడి, రెండు ఎకరాల నిమ్మ తోటలో గల 200 నిమ్మ చెట్లు పూర్తిగా నేలకు వాలడంతో రూ. 5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. తోటలను పరిశీలించిన అధికారులు పంట నష్టం నమోదు చేసుకున్నారు.



నేలకొరిగిన నిమ్మ చెట్లు చూపిస్తున్న రైతు సుదర్శన్